క్లుప్తంగా

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన



విద్యార్థులు ప్రదర్శించిన నమూనా

మీఎం పాలెం: సాంకేతిక విద్యా పరిషత్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. కళాశాల వార్షికోత్సవంలో భాగంగా పాలిటెక్నికల్ విద్యార్థులు విద్యుత్ ఉత్పాదన, పొదుపు, ప్రమాదాల నివారణ, నీటితో విద్యుత్ ఉత్పాదన తదితర అంశాలపై ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పర్యవేక్షించారు.

పేద కుటుంబానికి సరకుల పంపిణీ



సరకులు అందజేస్తున్న రవికుమార్

పద్మనాభం: కురపల్లిలో ఇటీవల మృతి చెందిన నిరుపేద కోసూరి సన్యాసిరాజు కుటుంబానికి రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరకులు అందజేశారు. ట్రస్టు చైర్మన్ రూపాకుల రవికుమార్ వీటిని అందజేశారు. సన్యాసిరాజు పిల్లలు చదువుకునేందుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు, గేదెల శ్రీహరి పాల్గొన్నారు.


వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు ఆహ్వానం

తగరపువలస: సైన్స్ డే సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు తెలుగు, హిందీ మాధ్యమాలలో వేర్వేరుగా ఈ నెల 28న నిర్వహించనున్నట్టు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో 26న ఉదయం 10 గంటల నుంచి 11 వరకు భారతరత్న డాక్టర్ సీవీ రామన్ జీవిత విశేషాలపై వ్యాసరచన పోటీలు, 11 నుంచి డాక్టర్ సీవీ రామన్ ఎఫెక్ట్ అనే అంశంపై 5 నిమిషాల వ్యవధిలో ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. ఒక్కో విభాగంలో ముగ్గురు విజేతలకు సైన్స్ డే రోజున బహుమతులు అందించనున్నారు. వివరాలకు 89856 47419లో సంప్రదించాలని కోరారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

తగరపువలస: భీమిలి మండలం గోస్తనీనది తీరం తాటితూరు కల్లాలు వద్ద గురువారం పేకాట శిబిరంపై భీమిలి ఎస్ఐ గంటా హరీష్ తన సిబ్బందితో దాడి చేశారు. 14 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.61,170 నగదుతోపాటు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

కలర్‌ఫుల్ కాగితం పువ్వులు



డివైడెర్ మధ్యలో కనువిందు చేస్తున్న కాగితం పువ్వులు

కొమ్మాది: బీచ్ రోడ్డు వెంబడి రోడ్డు మార్గ మధ్యలో గల డివైడెర్లలో వివిధ వర్ణాల కలర్‌ఫుల్ కాగితం పువ్వులు పర్యాటకులను, ప్రయాణికులను ఆకర్షిస్తూ కనువిందు చేస్తున్నాయి. తెలుపు, పసుపు, గులాబీ, ఎరుపు రంగుల్లోని ఈ పువ్వులు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

సమన్వయ లోపమే శాపం



దేవాదాయ శాఖ స్థలంలో ఉన్న రైతు భరోసా కేంద్రం

- కల్యాణ మండపం వినియోగానికి ఆటంకం
- రూ.లక్షలాది రూపాయలు దుర్వినియోగం
- శిథిలమైపోతున్న నిర్మాణాలు



ఆనందపురంలో నిరుపయోగంగా ఉన్న కల్యాణ మండపం

ఆనందపురం : అధికారుల అనాలోచిత చర్య, రెండు శాఖల మధ్య సమన్వయ లోపం, వెరసి ప్రజోపయోగ భవనాలను ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రమైన ఆనందపురంలో ఈ విచిత్ర పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు బాజాభజంత్రీలతో కళకళలాడిన మండపం ప్రస్తుతం కళాహీనంగా దర్శనమిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం సర్వే నంబరు 213లో 17.45 ఎకరాల గ్రామకంఠం స్థలం ఉంది. అందులో కొంత భాగం గుడిలోవ రంగనాథస్వామి దేవాలయానికి సంబంధించినది. కాగా ఆనందపురంలో సంతబయలుగా పిలుచుకునే ప్రాంతంలో 2005లో పంచాయతీ, పార్లమెంటు, వుడా సంస్థల నిధులతో కల్యాణ మండపం నిర్మాణం ప్రారంభించారు. అంచెలంచెలుగా సుమారు రూ.50 లక్షల వరకు వ్యయం చేసి నిర్మాణాలను పూర్తి చేశారు. సుమారు 15 ఏళ్ల వరకు మండపంలో శుభకార్యాలు నిరాటంకంగా సాగాయి. ఇదిలా ఉండగా దేవాదాయ శాఖ అధికారులు కొన్నేళ్ల కిందట రంగ ప్రవేశం చేసి కల్యాణ మండపం ఉన్న ప్రాంతం రంగనాథస్వామి దేవాలయానిది అంటూ స్వాధీనం చేసుకొని తాళాలు వేశారు. దీంతో అప్పటి నుంచి మండపం నిరుపయోగంగా ఉండడంతో పూర్తిగా శిథిలమైంది. భవనం పూర్తిగా దెబ్బతిని ముఖ ద్వారం, ప్రహరీ పాడైపోయాయి. ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచి అడుగు పెట్టలేని స్థితి నెలకొంది. దీంతో కొంత మంది భవనం ప్రాంగణాన్ని బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. భవనం రాత్రివేళ బూత్ బంగ్లాను తలపిస్తోంది. దీంతో ఒకప్పుడు గ్రామంలో శుభ కార్యాలతో కళకళలాడిన భవనం దుస్థితిని చూసి గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతికేళ్ల క్రితం భవనం నిర్మించినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజల ప్రయోజనార్థం కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

రైతు భరోసా కేంద్రం భవితవ్యం అయోమయం

దేవాదాయ శాఖకు చెందినదిగా చెప్పుకుంటున్న స్థలంలోనే నిర్మించిన భవనంలో రైతు భరోసా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ ఎంపీ నిధులతో మొదట భవనం నిర్మించారు. అందులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్వహించాలని గ్రామస్తుల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చినా వీలు పడలేదు. దీంతో ఖాళీగా ఉండడంతో అదే భవనంలో ప్రస్తుతం ఆర్బీకే నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ పరిధిలో గల స్థలంలో నిర్మించిన భవనాలను స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖ అధికారులు తెలుపుతుండడంతో ఆర్బీకే భవితవ్యం అయోమయంగా మారింది.

నిర్వహణకు అంగీకరించడం లేదు

పంచాయతీ తరఫున కల్యాణ మండపాన్ని నిర్వహిద్దామని దేవాదాయశాఖ అధికారులను సంప్రదించగా అంగీకరించడం లేదు. కనీసం శుభ్రం కూడా చేయనీయడం లేదు. దీంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రీరామమూర్తి, పంచాయతీ కార్యదర్శి, ఆనందపురం

మండపాన్ని మేమే నిర్వహిస్తాం

కల్యాణ మండపం, రైతు భరోసా కేంద్రాలు దేవాదాయ శాఖ స్థలాల్లో ఉన్నట్టు రికార్డులు తెలుపుతున్నాయి. దీంతో కల్యాణ మండపాన్ని మేమే నిర్వహించదలిచాము. తొందరలో కల్యాణ మండపం నిర్వహణకు వేలంపాట నిర్వహిస్తాం. మిగతా నిర్మాణాలపై పూర్తి స్థాయి విచారణ చేస్తాం.

– శిరికి నానాజీ, గుడిలోవ దేవస్థానం ఈవో

వైవీ సుబ్బారెడ్డి దృష్టికి భూదాన భూముల సమస్య



పరదేశిపాలెంలో వివాదంలో ఉన్న భూమి

మధురవాడ: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా, కోర్టు వివాదంలో ఉన్న భూదాన భూముల వివాదాన్ని మధురవాడకి చెందిన కొందరు నాయకులు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి గురువారం తీసుకెళ్లారు. మధురవాడ కారుషెడ్ కూడలి సమీపంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఎన్నికల కార్యాలయం గురువారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి వచ్చిన సుబ్బారెడ్డికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ 5వ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతురావు ఆధ్వర్యంలో పలువురు భూదాన సమస్య వివరించారు. కోర్టు ఆర్డర్ పేరుతో ఇక్కడ కొందరు వ్యక్తులు చెట్లు, తుప్పలు తొలగింపు చర్యలు చేపడతున్నారని వివరించారు. దీనిపై పూర్తి వివరాలు పంపించాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావుకి చెప్పారు.

కోర్టు ఆర్డర్ పేరుతో చెట్ల తొలగింపు

విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 132లో సుమారు 60.56 ఎకరాలు, 66లో 16 ఎకరాల మేర ఉంది. అనేక ఏళ్లుగా ఈ భూములు వివాదంలో ఉండిపోయాయి. గతంలో అనేకమార్లు రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

తాజాగా హైవేని ఆనుకుని ఉన్న సుమారు 16 ఎకరాల్లో ఒక చోట ఓ వ్యక్తి ఆధ్వర్యంలో కొందరు తమకు కోర్టు ఆర్డర్ ఉందంటూ చెట్లు, తుప్పలు తొలగించే ప్రక్రియకి శ్రీకారం చుట్టారు. ఈ విషయాన్ని విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య వద్ద ప్రస్తావించగా భూదాన భూముల సమస్య కోర్టులో ఉందని, అందులోకి ఎవరూ వెళ్లకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా పనులు చేస్తే నిలిపివేయిస్తామని తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ రఘురామ్

ఆనందపురం : ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ హెచ్చరించారు. ఆనందపురం పూల మార్కెట్ వద్ద డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను కూర్చో పెట్టరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు, వాహనానికి సంబంధించిన రికార్డులన్నీ వాహనంలోనే ఉంచాలన్నారు. రోడ్డు పక్కన నిర్దేశించిన స్థలంలోనే ఆటోలను పార్కింగ్ చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొని జరిమానాలు విధిస్తామని ఎస్ఐ రఘురామ్ హెచ్చరించారు.


అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలకు డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాందేవుపురం గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం గ్రామంలో అక్రమాలకు పాల్పడుతున్న దెందేటి అప్పన్న, దెందేటి చినప్పన్న, దెందేటి పైడిరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ గ్రామానికి చెందిన పలువురు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా హెచ్‌డీటీ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ వ్యక్తులు జిరాయితీ భూమిని ఆక్రమించారని, ప్రభుత్వ కమ్యూనిటీ హాలు కూలగొట్టారని, రక్షిత మంచి నీటి పథకం స్థలాన్ని ఆక్రమించి గోడ కట్టారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. దెందేటి అప్పన్న, దెందేటి చినప్పన్న పాస్టర్లుగా పని చేస్తున్నారని, వారు ఎస్సీలు కాదని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సాగి కృష్ణమూర్తిరాజు, వి.పైడి నాయుడు, ఐ.వి.ఎస్.ఎన్.రాజు, పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లులో అంధకారం



పెద్దిపాలెం అండర్ పాత్ వద్ద చిమ్మ చీకట్లు

అండర్‌పాత్‌ల వద్ద వెలగని వీధి లైట్లు



వెల్లంకి వద్ద సర్వీసు రోడ్డులో పనిచేయని లైట్లు

ఆనందపురం : ఆరులైన్ల రహదారికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్లలో లైట్లు వెలగడం లేదు. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గండిగుండం నుంచి తగరపువలస వరకు స్థానికులు రాకపోకలు సాగించుకోవడానికి వీలుగా ఆరులైన్ల రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించారు. వాటికి ఇరువైపులా నివాస ప్రాంతాలున్న చోట రాత్రివేళ ప్రమాదాలు జరగకుండా లైట్లు ఏర్పాటు చేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టరు వీధి లైట్ల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడంతో ఎప్పుడో గానీ వెలగడం లేదు. ఈ విషయమై ప్రశ్నించినా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. అలాగే మండల పరిధిలో పెద్దిపాలెం, దుక్కవానిపాలెం, గుడిలోవ, నీళ్ల కుండీలు, శొంఠ్యాం, సత్రవు జంక్షన్, గండిగుండం ప్రాంతాల్లో అడర్‌పాత్‌లు నిర్మించారు. అయితే అక్కడ కూడా వీధి లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా పట్టించుకోలేదు. దీంతో వాహనచోదకులు చిమ్మ చీకటిలోనే రాకపోకలు సాగించి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు వెలిగించే ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన సీతంరాజు సుధాకర్ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి తన క్యాంపు కార్యాలయం వద్ద నాలుగు వార్డులు, మధురవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. దాంతోపాటు పట్టభద్ర నిరుద్యోగులకు ఎన్నడూ లేనంతగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. అందులో భాగంగానే సచివాలయ వ్యవస్థలో వేలాది మందికి అవకాశం ఇచ్చామన్నారు. ఎన్నో కంపెనీలు, పరిశ్రమలు వస్తున్నాయని... వాటిల్లో కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు రానున్నాయన్నారు. వెనుకబడిన వర్గాల వారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా సీఎం జగన్ ఎంపిక చేసి వారికి ప్రాధాన్యమిచ్చారన్నారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపిస్తే ఉత్తరాంధ్రకు, పట్టభద్రులకు మరింత మేలు జరుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నాయకులంతా మన అభ్యర్థికి ఓట్లు వేయించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు బాలరాజు మాట్లాడుతూ ఈ ఎన్నికను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని సుధాకర్‌ను గెలిపించడానికి కృషి చేయాలని కోరారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసం

తగరపువలస: ఇంటి దగ్గరే ఉంటూ కవర్లపై అడ్రస్‌లు రాస్తే నెలకు రూ.12వేలు సంపాదించవచ్చన్న ప్రకటనలు చూసి భీమిలి ప్రాంతంలో పలువురు నిరుద్యోగులు మోసపోయారు. విశాఖ కేంద్రంగా చంటి అనే వ్యక్తి ఈ మోసాలకు పాల్పడినట్టు నిరుద్యోగులు లబోదిబోమంటున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వల వేసిన చంటి రిజిస్ట్రేషన్‌కు రూ.100, ఐడెంటిటీ కార్డుకు రూ.50, రిఫండబుల్ పేరుతో రూ.550 మొత్తంగా రూ.700 వంతున ఫోన్ పే ద్వారా వసూళ్లకు పాల్పడ్డాడు. అంతేకాకుండా డబ్బులు పంపించిన వారికి రిజిస్ట్రేషన్ నంబర్లు కూడా పంపించాడు. వారానికి 500 కవర్లు వంతున నెలలో 2 వేల కవర్లపై తాము పంపించిన చిరునామాలు రాయాలని, వాటిని ఇంటి వద్దకే తీసుకొచ్చి మళ్లీ సేకరిస్తామని వాయిస్ మెసేజ్‌ల ద్వారా నమ్మబలికాడు. దీంతో పలువురు నిరుద్యోగులు చంటి పంపిన నంబర్‌కు డబ్బులు పంపించారు. ఈ నెల చివరి నుంచి పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన చంటి రెండు రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో తాము మోసపోయినట్టు గ్రహించారు. ఇలా డబ్బులు పంపించి మోసపోయినవారిలో ఎక్కువగా గృహిణులే ఉన్నారు. ఇలాంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇప్పుడు వారే ప్రచారం నిర్వహిస్తుండటం విశేషం.

జీ 20 సదస్సు విజయవంతమే లక్ష్యం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న పోలీసులు, సిబ్బంది

కొమ్మాది: ఎంతో ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పోలీసుల బాధ్యత ఎంతో కీలకమని, సదస్సు విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద సూచించారు. జీ – 20 సదస్సుకు సంబంధించి సాగర్‌నగర్‌లో గల సన్ ఇన్‌స్టిట్యూట్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం సాఫ్ట్ స్కిల్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. వచ్చేనెల 28 నుంచి నిర్వహించే సదస్సుకు వచ్చే వివిధ దేశాల ప్రతినిధులతో ఎలా మెలగాలి, ఏ విధంగా నడుచుకోవాలి అనే అంశాలతోపాటు భద్రతా పరమైన అంశాలు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ అర్బన్ పరిధిలో 11 కేవీ తాళ్లవలస, 11 కేవీ చిట్టివలస, 11 కేవీ సంగివలస ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్టా రవి తెలిపారు. ఈ అంతరాయం కారణంగా చిట్టివలస, ఆదర్శనగర్, సంతపేట, కొత్తపేట, చాకలిపేట, కొండపేట, సప్తగిరి, గణేష్ థియేటర్ ఏరియా, తగరపువలస – భీమిలి రోడ్డు, ఉళ్లపేట, నమ్మివానిపేట, సబ్బివానిపేట, చిల్లపేట, ఇడదాసరిపేట, తాళ్లవలస తిరుమల విద్యాసంస్థలు ఏరియా, రాజుల తాళ్లవలస, సుఖీభవ కాలనీ, వలందపేట, లెజెండ్ లే అవుట్, గొల్లల తాళ్లవలస, మన్యాలపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ రేవళ్లపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్వీవీఎస్ రామమూర్తి చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భాస్కర్‌నగర్, సంపత్‌నగర్, ఉజ్వల హాస్పిటల్ ఏరియా, శ్రీవల్లి నగర్, చంద్రంపాలెం (మధురవాడ) హైస్కూల్ ఏరియా, రేవళ్లపాలెం విలేజ్, రేవళ్లపాలెం రోడ్డులోని పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని రామమూర్తి కోరారు.

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ రూరల్ పరిధిలో 11 కేవీ దాకమర్రి వాటర్ వర్క్స్, 11 కేవీ దాకమర్రి రూరల్ ఫీడర్ల మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ జాగరపు రాము తెలిపారు. ఈ అంతరాయం కారణంగా బాలాజీనగర్, ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, మజ్జివలస, లక్ష్మీపురం, శింగనబంద, విజయరాంపురం, కృష్ణంరాజుపేట, మద్దిలపేట, కనకలపేట, మహారాజుపేట, నారాయణరాజుపేటకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉన్నత విద్యకు ఆర్థిక సాయం

తగరపువలస: భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట అంబేద్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఆయాగా పనిచేస్తున్న దమరసింగి సుజాత పిల్లల ఉన్నత చదువు కోసం భీమిలికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ పి.వి.వై.ప్రసాదరావు గురువారం రూ.5 వేల సాయం అందించారు. పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన సాయి సంహిత ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.అప్పలరాజు ద్వారా ఈ సాయం సుజాతకు అందించారు. ఇప్పటి వరకు పలువురు దాతలు సుజాత పిల్లల చదువుకు సహాయ సహకారాలు అందించినట్టు అప్పలరాజు తెలిపారు.

పబ్లిక్ డిమాండ్

జనావాసాల మధ్య పందుల సంచారం



పీఎం పాలెం శ్రీనిధి అపార్ట్‌మెంట్ ఎదురుగా సంచరిస్తున్న పందులు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీనిధి అపార్ట్‌మెంట్ ఎదురుగా పదుల సంఖ్యలో పందులు తిష్ఠ వేస్తున్నాయి. అపార్ట్‌మెంట్ పరిసరాల్లో తుప్పలు పెరగడంతో విష పురుగుల సంచారం కూడా ఎక్కువయింది. జీవీఎంసీ శానిటేషన్ విభాగంతో శుభ్రం చేయించాలని ఇప్పటికే పలుమార్లు జోనల్ కార్యాలయంతోపాటు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేశాము. పందులు, విష పురుగుల నుంచి మా ప్రాంతానికి విముక్తి కలిగించాలని కోరుతున్నాం. – వి.హరిబాబు, శ్రీనిధి రెసిడెన్సీ, పీఎం పాలెం.

రైతుబజార్‌లో అందుబాటులో కొత్త చింతపండు



వినియోగదారులకు కొత్త చింతపండు ప్యాకెట్ అందిస్తున్న ఈవో ప్రసాద్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో కొత్త చింతపండు అందుబాటులోకి వచ్చింది. ఇంతవరకు ఇక్కడ రైతులు విక్రయిస్తున్న ధర కంటే దీని ధర అధికారులు తక్కువగా నిర్ణయించారు. బజార్‌లో ఏర్పాటు చేసిన జీసీసీ స్టాల్‌లో గురువారం నుంచి కొత్త చింతపండు విక్రయాలు ప్రారంభించారు. పిక్కతో 3 కిలోలు, 5 కిలోల చొప్పున ప్యాకెట్లుగా చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ఇక్కడ 3 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.130, 5 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.210గా ధర నిర్ణయించారు. రైతులు విక్రయిస్తున్న చింత పండు కిలో రూ.72 ఉంది. దీంతో వినియోగదారులు జీసీసీ స్టాల్‌లో చింతపండు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఇక్కడ రైతులు విక్రయించే ధర తగ్గే అవకాశం ఉందని వినియోగదారులు, రైతుబజార్ సిబ్బంది భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయ వంట నూనె ధరలు ఇలా..

చింతపండుతో పాటు ఇక్కడ ప్రత్యేక కౌంటర్‌లో విజయ వంట నూనెలను అందుబాటులో ఉంచారు. సన్ ఫ్లవర్ నూనె లీటర్ రూ.130, పామాయిల్ లీటర్ రూ.103, వేరు శనగ నూనె లీటర్ రూ.178, రైస్ బ్రౌన్ ఆయిల్ లీటర్ రూ.121 విక్రయిస్తున్నట్లు రైతు బజార్ ఈవో ప్రసాద్ తెలిపారు. ఇక్కడ నూనెలు బయట ధరల కంటే తక్కువగా ఉంటాయన్నారు.